అర్చకులకు సహాయం అందజేత..

అర్చకులకు సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 20: సామాజిక సేవలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గం లోని పలు దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు అందించే సహాయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. గత మూడేళ్లుగా ఒక్కొక్క అర్చకుడికి రూ.5వేల చొప్పున 12 మందికి ఎమ్మెల్యే సహా యం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెలకు సంబంధించి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ .. నియోజకవర్గంలోని వివిధ అమ్మవారి దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు 12 మందికి గత మూడేండ్లుగా ప్రతి నెల రూ.5వేల చొప్పున సహాయం చేస్తున్నానని చెప్పారు.

వీరసావర్కర్ విగ్రహాన్ని కాపాడాలి..

కాచిగూడ,డిసెంబర్ 20: దేశం కోసం పోరాడిన పోరాట యోధుడు వీరసావర్కర్ విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. కాచిగూడ చౌరస్తాలోని వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాశ్‌పటేల్, భీంరాజ్, సూలం రవియాదవ్, ఆర్.సంతోశ్, బాలప్రసాద్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్

దశలవారీగా డ్రైనేజీ సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే ముఠా గోపాల్ ... రూ.17లక్షలతో వరద నీటి పైపులైన్ పనులు ప్రారంభం

రాంనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 20: ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించనున్నట్లు చెప్పారు. బుధవారం ఆయన.. రాంనగర్– చేపల మార్కెట్ రోడ్, రిసాలలో రూ .17 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు ముదిగొండ మురళీ, ఎర్రం శేఖర్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, వి.సు ధాకర్‌గుప్తా, దీన్‌దయాళ్‌రెడ్డి, రవియాదవ్, భాస్కర్, సందీప్, మధు, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలను సాధించిన రాఘవ్

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు, పతకాన్ని సాధించిన రాఘవ్

కవాడిగూడ, డిసెంబర్ 20: డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఎన్‌సీటీ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 67వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2023–24లో నగరానికి చెందిన గుగ్గిళ్ల రాఘవ్ జాతీయ స్థాయిలో బంగారు, కాంస్య పతకాలను సాధించి నగర ఖ్యాతిని చాటి చెప్పారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో గల స్లేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి రాఘవ్ అండర్ (17).. 70 కేజీల కేటగిరి మార్షల్ ఆర్ట్స్‌లో రాణించి బంగారు పతకంతో పాటు కాంస్య పతకాన్ని సాధించాడని రాఘవ్ తల్లిదండ్రులు గుగ్గిళ్ల వినయ్ కుమార్, శాంతి లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ మాస్టార్‌లు సయ్యద్ ఆదిల్, శంకర్‌లు రాఘవ్‌ను అభినందించారు.

ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణం

కవాడిగూడ, డిసెంబర్ 20: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే రెండు రోజుల్లో 141 మంది ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. పార్లమెంట్ భద్రతా ఉల్లంఘనపై ప్రతిపక్ష ఎంపీలు నిలదీస్తే వారిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. పార్లమెంట్ లోపల విధ్వంసం సృష్టించిన దోషులకు ప్రవేశపాస్‌లపై సంతకం చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయకుండా, నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని అన్నారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి ఏమాత్రం విశ్వాసం లేదని అన్నారు.

ప్రతి భారతీయుడు గోవులను ప్రేమించాలి

కాచిగూడ,డిసెంబర్ 20: ప్రతి భారతీయుడు గోవులను ప్రేమించాలని, వాటిని రక్షించేవారే నిజమైన భారతీయుడని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంబర్‌పేట పటేల్‌నగర్ గోశాలలోని గోవులకు నెల రోజులకు సరిపడ దాణా,మినరల్ మిక్చర్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం మహేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. గోవుల సంరక్షణ,గోశాలలను దత్తత తీసుకోవడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సమర్పన్ శాఖ అధ్యక్షుడు మహేందర్‌గుప్తా, కార్యదర్శి నిర్మల్‌కుమార్ జైన్, కోశాధికారి ప్రేమ్‌చంద్‌మనోజ్, పండిత్ గంగారామ్, భక్తరామ్, అనిల్‌కౌశిక్, బానోత్ గణేశ్, లకావత్ రమేశ్ పాల్గొన్నారు.

వేగంగా ఇందిరాపార్కులో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఇందిరా పార్కులో ఫౌంటెయిన్‌ను పరిశీలిస్తున్న యూబీడీ అదనపు కమిషనర్ కృష్ణ

కవాడిగూడ, డిసెంబర్ 20: ఇందిరాపార్కులో జరుగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (యూబీడీ) కృష్ణ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఇందిరా పార్కులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాపార్కులో జరుగుతున్న రోజ్ గార్డెన్‌లో వాటర్ ఫౌంటెయిన్, వాకింగ్ ట్రాక్ , ఓపెన్ జిమ్ పరికరాలు, పార్కులో అదనపు బెంచీల ఏర్పాటు, ఇందిరాగాంధీ విగ్రహానికి మరమ్మతులు చేయడం, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి సందర్శకులకు అం దుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పార్కులో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు గ్రీనరీ ఏర్పాటు, క్లీనింగ్ మెయింటెనెన్స్‌ను సమయా నుకూలంగా నిర్వహించి అహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, యూబీడీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ సర్కిల్–15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, యూబీడీ ఇన్‌చార్జి గణేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈ సన్నీ, విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరమణారెడ్డి, ముషీరాబాద్ ఉద్యానవన శాఖ ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ల మేనేజర్ భాస్కర్, ఇందిరా పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ యాదవ్, వాకర్స్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సొసైటీ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొడిమల మహేందర్ కుమార్ ఆధ్వర్యం లో రూపొందించిన 'ఆ నాటి– నేటి స్త్రీ' పుస్తకంను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే

– చిక్కడపల్లి, డిసెంబర్ 20

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి మహాపడిపూజ మహేశ్వరిస్వామి ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి భజన గీతాలు ఆకట్టుకున్నాయి. గురుస్వామి మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో స్వాములు టి.వెంకటేశ్, ఎం.సతీష్, బొట్టు శ్రీను, స్వామి పాల్గొన్నారు.*–అంబర్‌పేట, డిసెంబర్ 20*

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు ..

చిక్కడపల్లి, డిసెంబర్ 20 : నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 23న ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు కుమారుడు జి.శ్రీనాథ్‌లు మాట్లాడుతూ.. ధనుర్మాస వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయని తెలిపారు. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

పాక జ్ఞానేశ్వరికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 20 : గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన కామారెడ్డి నివాసురాలు పాక జ్ఞానేశ్వరిరవి ప్రసాద్‌కు ఎమ్మెల్సీ, ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని చిక్కడపల్లి గంగపుత్ర (బెస్త) సంఘం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను కోరారు. ఈ మేరకు బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్‌బాబు మాట్లాడుతూ..పాక జ్ఞానేశ్వరిరవి ఉన్నత విద్యావంతురాలు, న్యాయవాది, తెలంగాణ ఉద్యమం లో చురుకైన పాత్ర వహించారని తెలిపారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేశారని గుర్తు చేశారు. దీంతో జ్ఞానేశ్వరిరవికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నరాల వెంకటేశ్, కోశాధికారి వినోద్, ఉపాధ్యక్షులు గడప నర్సింగ్ రావు, కొండ్రు నర్సింహా, రాజ్‌కుమార్, కూరరాజు, తదితరులు పాల్గొన్నారు.

24న ఉచిత మెగా వైద్యశిబిరం

కాచిగూడ, డిసెంబర్ 20 : కిమ్స్, సన్‌షైన్ దవాఖాన(బేగంపేట)ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఈ నెల 24న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాచిగూడలోని శ్రీ శ్యామ్‌బాబా మందిర్‌లో నిర్వహిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో బీఎండీ, మోకళ్ల చికిత్స వైద్య పరీక్షలతోపాటు ఫిజియోథెరపి, ఈసీజీ, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులు పాల్గొని ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు ఫోన్: 9177775016, 9949238492లలో సంప్రదించాలని కోరారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి : పీడీఎస్‌యూ

ముషీరాబాద్, డిసెంబర్ 20: తెలంగాణలో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జాతీయ నేత నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణలు డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో వారు ప్రసం గించారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్ల వైపు విద్యార్థులు వెళ్లకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. విద్యార్థులకు సకాలంలో ఉపకార వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అజాద్, పృథ్వీ, నరేందర్, అనిల్, భాస్కర్, నరసింహారావు, సంధ్య, ప్రవీణ్, సుమంత్, సీతారాం, రాకేష్, మహేందర్ పాల్గొన్నారు.